సాక్షి
నిర్మల్
శనివారం । 14 । జూన్ । 2025



రక్తదానం.. ప్రాణదానం
ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం. నేడు ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 8లో▸



ఆటపాటల బడి.. అంగన్‌వాడీ
మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' పేరిట ఈనెల 10 నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.4 /25.5

వాతావరణం
ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



ఇన్‌చార్జి మంత్రితో జిల్లా నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కాంగ్రెస్ కండువాతో సత్కరించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌చార్జి మంత్రి సూచించారు. ఇందులో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నిర్మల్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు

పోగొట్టుకున్న ఫోన్లు రికవరీ



ఫోన్లు అందిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, పోలీస్ స్టేషన్‌లో లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 88 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం వాటిని అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి చెక్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 1,416 ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ కోర్, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

ఖానాపూర్: పాఠశాలల పునఃప్రారంభమైన నేపథ్యంలో అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ చేయించాలని ఏఎంవీఐ ముర్తుజా అలీ సూచించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రైవేట్ స్కూల్ బస్సులను శుక్రవారం తనిఖీ చేశారు. సకాలంలో ఫిట్‌నెస్ చేసుకోవడంతోపాటు ఇన్స్యూ?న్స్, అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. 60 ఏళ్ల పైబడిన వారిని డ్రైవర్లుగా నియమించుకోవద్దని సూచించారు. రోడ్ ట్యాక్స్‌తోపాటు లైసెన్స్ తప్పకుండా ఉండాలన్నారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, ఫైర్ సేఫ్టీ వస్తువులు ఉంచాలని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఆర్టీఏ అధికారులు ఏఎంవీఐ దూప్‌సింగ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో రూ.7,500 జరిమానా విధించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

బాసర: ఆర్జీయూకేటీలో విద్యార్థులకు ప్రేరణాత్మక ఉపన్యాసం, అకడమిక్ పరంగా విజయాలు అందుకునేందుకు, మానసిక ఉత్సాహాన్ని కలిగించేందుకు ప్రత్యేక ప్రేరణాత్మక శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ శ్రమ, ఆత్మవిశ్వాసం సమయపాలన వంటి విలువలపై దృష్టి సారించాలన్నారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న క్లాసులు, మెంటరింగ్ ప్రోగ్రాంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకమైన విద్యా సహాయం అందిస్తున్న అధ్యాపకుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డాక్టర్ మహేశ్, డాక్టర్ విఠల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర బాక్సింగ్ అకాడమీలో జిల్లాస్థాయి సీనియర్స్ బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ సెక్రెటరీ చందుల స్వామి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్‌తో క్రీడాకారులు హాజరుకావాలని సూచించారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 15న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 9966677105 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కబ్జాలు.. కామన్..!?



ఇదిగో.. ఇది ఇంకో ముచ్చట. 'గొలుసుకట్టు'ను తెంపేస్తూ చెరువులనే చెరబట్టే కథ. ఇక్కడ కూడా ఫస్ట్ ఫొటోను చూడండి. ఇది జిల్లాకేంద్రంలోనే మల్లన్నగుట్ట హరిహరక్షేత్రం ఎదురుగా మొన్నటిదాకా ఉన్న ఓ పేద్దకుంట. అవును పెద్దదిగా ఉండేది.. ఇప్పుడది చిన్న గుంతలా మారిపోయింది. కాదు మార్చేశారు. గొల్లపేట చెరువు అలుగు ఈ కుంటలో చేరి, ఇక్కడి నుంచి ఇబ్రహీం చెరువులోకి నీళ్లు వెళ్లేలా 'గొలుసుకట్టు' విధానంలో భాగమైన కుంట ఇది. కొంతమంది స్థానికులు బతుకమ్మ కుంటగానూ పిలుస్తుంటారు.



ఇక.. ఈ ఫొటో చూస్తే సిన్మా అర్థమవుతుంది. రెండేళ్ల కిందట పెద్దగా ఉన్న కుంట ఇప్పుడిలా అయింది. ఇంకో విషయం అలుగును డ్రైనేజీ లెక్క కట్టేసి చెరువులకు విడిచిపెట్టారు. అంటే.. రేపొద్దున ఇక్కడ ఇళ్లు కట్టుకుంటే, ఆ ఇళ్ల డ్రైనేజీ నీళ్లన్నీ చెరువులకు పోవాల్సిందే.



ఈ ఫొటోలో ఉన్నది ఫారెస్ట్ చెక్‌పోస్టు. మొన్నటి వరకు శివాజీ చౌక్‌లో స్మశానం వెనుకభాగంలో, నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఉండేది. అటవీ సంపదను కాపాడటానికి ఎప్పుడో దశాబ్దాల కిందట కట్టిన సర్కారు భవనం.



ఆ ఫారెస్టు చెక్‌పోస్టు గది శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కూల్చివేశారు. ఆ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు వేసిన షెడ్డు ఇదీ. దీనిని మున్సిపల్ అధికారులు పాక్షికంగా తొలగించారు. ఇక్కడ అసలు విషయమేందంటే.. మెయిన్‌రోడ్డు మీదనే సర్కారు జాగాలో ఇలా షెడ్డేసి కబ్జా చేస్తున్నారు.

- జిల్లా కేంద్రంలో ఆగని ఆక్రమణలు
- ప్రభుత్వ స్థలాల్లోనే అక్రమ పాగాలు
- పురావస్తు ఆస్తులూ.. అన్యాక్రాంతం
- సర్కారు జాగాలకు 'ఇంటి నంబర్లు'

నిర్మల్: 'మాది రాయల్ నిర్మల్.. మస్తుంటది..' అంటూ చాలామంది గొప్పలు చెబుతుంటారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలతో ముచ్చట్లు పెడుతుంటారు. కానీ.. రియల్‌గా నిర్మల్ నిమ్మలంగా లేదన్నది వాస్తవం. రాష్ట్రంలోనే కబ్జాలకు పెట్టింది పేరుగా నిర్మల్ పేరు మార్మోగుతోంది. గొలుసుకట్టు చెరువులు, కాలువలు, కందకాలు, చివరకు ప్రభుత్వ స్థలాలు, పురావస్తు కట్టడాలు దేన్నీ విడిచి పెట్టకుండా చెరబడుతున్నారు. మారుమూల సందుల్లోనే కాదు.. సాక్షాత్తు అందరూ చూసే ప్రధాన రహదారుల పక్కనే ఆక్రమణలు కొనసాగుతున్నాయి.

ఆక్రమణలో చరిత్ర ఆనవాళ్లు..!

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అణువణువునా నిమ్మలలో చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. కానీ.. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా చెరిపేస్తున్నారు. చరిత్రకు సమాధి కట్టేస్తున్నారు.

- అంతటా.. పాతబావులంటూ పాడుబడినవాటిని తవ్వి, పర్యాటక ప్రదేశాలు చేస్తున్నారు. ఇక్కడేమో అంతా ఉల్టాపల్టా.. మంచిగా ఉన్న పాత కాలం బావులను పూడ్చేస్తున్నారు.
- సర్దుమహల్‌కు నీటినందించే ఏనుగులబావిని నామరూపాలు లేకుండా చెత్తతో నింపేస్తున్నారు. పాతగ్రంథాలయం, ఫైర్ స్టేషన్ వెనుక, మున్సిపల్ నుంచి ఈద్‌గాం వెళ్లేదారిలో గల ఈబావి చాలా పెద్దగా ఉండేది. దాన్నిప్పుడు మొత్తం మున్సిపల్ చెత్తతో పూడ్చేస్తున్నారు. ఇదే అదనుగా అక్కడ క్రమంగా ఆక్రమణలకు అడుగులు పడుతున్నాయి.
- సమీకృత మార్కెట్.. పేరు చెప్పి ఒకప్పటి చారిత్రక భవనమైన అర్బన్ తహసీల్ కార్యాలయాన్ని కూల్చేశారు. ఇంతటితో ఆగకుండా దానివెనుకే.. ఒకప్పటి అద్భుత నిర్మాణమైన సరస్సునూ పూడ్చేశారు. సమీకృత మార్కెటు నిర్మాణానికి కనీసం అడుగు కూడా ముందుకు పడటం లేదు. కానీ.. ఈ ఖాళీ జాగాపై ఆక్రమణల కన్నుపడుతోంది.
- ప్రియదర్శినినగర్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వెనుక ఉన్న గజ్‌గఢ్ చుట్టూ ఉన్న కందకాన్ని ఇప్పటికే మట్టితో నింపేసి ఆక్రమించేశారు. గతంలో 'సాక్షి' వరుస కథనాలు రాయడంతో అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్పందించి ట్రెంచ్ కొట్టించడంతో కొంతభాగం కందకం మిగిలింది.
- చారిత్రక చైన్‌గేట్‌కు ఇరువైపులా ఒకప్పటి చారిత్రక కందకం నామరూపాలు లేకుండా పోతోంది. జీవోల పేర్లు చెప్పి ఇప్పటికే ఓ దిక్కు కందకాన్ని సగానికి పైగా ఆక్రమించారు. మరోదిక్కూ అదే తరహా కబ్జా కొనసాగుతోంది.
- బంగల్‌పేట్ శివారులో ఉన్న బురుజులన్నీ కబ్జాలకు గురవుతున్నాయి.
- ఎక్కడా ఉండని మరో విచిత్రమైన విషయమేంటే.. చుట్టూ బలమైన, ఎత్తయిన రాతిగోడ కట్టడం ఉన్న శ్యాంగఢ్ లోపల కొందరికి పట్టాభూములు ఉండటం.

మున్సిపల్ స్థలాలూ..

అవీ ఇవీ అని తేడా లేకుండా కబ్జాల కొనసాగుతున్నాయి. సర్కారు జాగాల్లోనూ పాగా వేస్తున్నారు. పట్టణాన్నీ చూసుకోవాల్సిన మున్సిపల్‌లోనే దొంగ ఇంటినంబర్లు ఇస్తూ.. ఈ కబ్జాలకు ప్రోత్సాహమిస్తున్నారు. గుట్టలు, పురావస్తు కట్టడాల్లోనూ ఇళ్లను కట్టేస్తున్నారు. అసలు బల్దియా.. తన ఆస్తులనే కాపాడుకోలేని స్థితికి చేరుతోంది. ఒకప్పుడు కమిషనర్ ఉండేందుకు ఉన్న క్వార్టర్‌ను కూల్చేశారు. ఆ స్థలానికి కనీసం ఫెన్సింగ్ కూడా పెట్టలేదు. ఇప్పటికే పలుచోట్ల కందకాలు, కాలువల్లో ఆక్రమణలు చేయడంతో మురుగునీరుకూ దారి లేకుండా పోయింది. అందుకే ప్రతీ వానాకాలం ప్రధాన రహదారి, శివాజీచౌక్‌లు నీటమునుగుతున్నాయి. ఏళ్లుగా ముంపు ముంచేస్తున్నా.. కబ్జాలపై మాత్రం చర్యలు కనిపించడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు సకాలంలో స్పందించకపోతే.. ఊరికంటూ ఏదీ మిగలదని నిర్మల్‌వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

> **చర్యలు చేపడుతున్నాం..**
> నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పలుచోట్ల అక్రమ కట్టడాలను తొలగించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురాతన కట్టడాల పరిరక్షణ చర్యలు చేపడతాం.
> – జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

ఏవోల పంచాయితీ..!

- భైంసా అర్బన్, రూరల్ మధ్య వైరం
- విధి నిర్వహణలో అస్పష్టత
- అనుమానాలకు తావిస్తున్న డీఏవో తీరు

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ శాఖలో అర్బన్, రూరల్ ఏవోల (వ్యవసాయాధికారులు) మధ్య విధి నిర్వహణలో వివాదం నడుస్తోంది. ఈ వివాదం రైతులు, వ్యాపారులను అయోమయంలో పడవేస్తోంది.

అర్బన్–రూరల్ ఏవోల బాధ్యతలు

భైంసా పట్టణం, మండలం పరిధిలో 2008లో ప్రభుత్వం అర్బన్, రూరల్ ఏవో పోస్టులను మంజూరు చేసింది. ఈ అధికారులు తమ పరిధిలో విత్తనాలు, ఎరువుల నాణ్యత పర్యవేక్షణ, డీలర్ల నియంత్రణ వంటి విధులు నిర్వహించాలి. 2024లో రవి (అర్బన్), గణేశ్ (రూరల్) బదిలీపై వచ్చారు. అయితే, రూరల్ ఏవో గణేశ్ అర్బన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

విధుల కేటాయింపులో అస్పష్టత

జిల్లా వ్యవసాయాధికారి అర్బన్ ఏవో రవికి శాంపిల్ సేకరణ వంటి కీలక విధులు కేటాయించకుండా, రూరల్ ఏవోకు అనుమతులు ఇవ్వడం విమర్శలకు దారితీస్తోంది. భైంసా పట్టణం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండో అతిపెద్ద విత్తన మార్కెట్ కాగా, రూ. కోట్లలో వ్యాపారం జరుగుతుంది. ఈ అస్పష్టత వెనుక జిల్లా అధికారి పక్షపాతం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిణామాలు

ఈ పంచాయితీ అర్బన్ ఏవోపై మానసిక ఒత్తిడిని కలిగిస్తుంది. రైతులు, వ్యాపారులు సరైన సేవలు పొందలేక అయోమయంలో ఉన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించడం శాఖ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. ఏవోల విధి నిర్వహణలో స్పష్టత, నిష్పక్షపాతం అవసరం. జిల్లా అధికారులు ఈ వివాదాన్ని పరిష్కరించి, రైతులకు నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

> **ఉన్నతాధికారి ఆదేశాల మేరకే..**
> భైంసా అర్బన్, రూరల్ ఏవోలు ఇద్దరినీ విధులకు వినియోగించుకుంటున్నాం. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు వారివారి విధులు నిర్వహిస్తున్నారు. డీలర్ల నుంచి విత్తనాలు, ఫర్టిలైజర్ శాంపిళ్ల సేకరణ ఏవోలకు అప్పగించే బాధ్యత జిల్లా అధికారిదే. మాకు ఎవరిపైనా వివక్ష లేదు.
> – వీణ, ఏడీఏ, భైంసా

తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పాలి

- డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వయోజన విద్యపై మండల స్థాయి సిబ్బందికి శుక్రవారం ఇచ్చిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. మొదట గ్రామ, మండల , జిల్లా స్థాయిలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. శిక్షణకు హాజరైన మండల విద్యాధికారులు, సెర్ప్ సిబ్బంది సీఆర్పీలు, ఐఆర్పీలు అందరూ సమన్వయంతో, స్వయం సహాయక బృందాల ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. శిక్షకులను నియమించి అక్షరాస్యులుగా చేయాలన్నారు. డీఆర్డీవో ఇన్‌చార్జి పీడీ నాగవర్ధన్, మెప్మా పీడీ సుభాష్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, వయోజన విద్య కోఆర్డినేటర్ తిరుపతిరావు, డీపీఎం సాయిప్రసాద్, నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, ఎంఈవోలు, ఏపీఎం, సీసీలు, సీఆర్పీలు ఐఆర్పీలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఈవో రామారావు

ప్రవేశాలు పెంచాలి..

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని డీఈవో రామారావు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంజులాపూర్ ప్రైమరీ పాఠశాలను పరిశీలించారు. నూతనంగా నమోదైన విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల విద్యార్హతలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం ఆయా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్, ఎస్‌వో రాజేశ్వర్, హెచ్‌ఎం కవితారాణి, ఉపాధ్యాయులు సుధీర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

నిర్మల్‌చైన్‌గేట్: వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో రాజేందర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు అధికంగా ప్రబలినచోట ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారులు డాక్టర్ ఆశిష్‌రెడ్డి, డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డీపీవో రామచందర్ జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

బడుగులపై పిడుగులు

- ఏటా ఉమ్మడి జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం
- పంట చేన్లలో మరణాలు, జీవాల మృత్యువాత
- అవగాహన లేక పెరుగుతున్న ముప్పు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా పిడుగుపాటుకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతోంది. అధికంగా పంట చేన్లలో పని చేస్తుండగానే మృత్యువాత పడుతున్న ఘటనల సంఖ్య పెరిగిపోతోంది. ఒక్కోసారి ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ముగ్గురు చనిపోతుండడం తీరని విషాదాన్ని మిగుల్చుతోంది. పేద, మధ్య తరగతి రైతు కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. బాధిత కుటుంబాలకు కోలుకోలేని నష్టం జరుగుతోంది. వానాకాలంలో పశువులు, జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రతీ సీజన్‌లో అనేకమంది తమ జీవాలను కోల్పోతున్నారు. పిడుగుపాటుపై చాలామందికి ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన రావడం లేదు. ఎక్కువగా చేన్లలో పని చేస్తున్నసమయంలోనే నష్టం జరుగుతోంది. పంట చేన్లలో పని చేసే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

పిడుగు అంటే..

ఆకాశంలో సహజసిద్ధంగా ఏర్పడే విద్యుత్‌పాతమే పిడుగుగా పేర్కొంటారు. సూర్యరశ్మి అధికంగా తాకి, తక్కువ బరువున్న ధనావేశిత మేఘాలు పైకి వెళ్లి, అధిక బరువున్న రుణావేశిత మేఘాలు కిందికి వస్తాయి. ఈ రెండింటి మధ్య దూరం పెరిగితే ధనావేశం గాలి కోసం భూమి వైపు రుణావేశా మేఘాలు వచ్చే క్రమంలో శక్తివంతమైన విద్యుదుత్పాతం ఏర్పడుతుంది. దీనినే పిడుగు అంటారు. ఒక్కో పిడుగు వేల డిగ్రీల సెల్సియస్ శక్తిని విడుదల చేస్తుంది. ఆయా ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితుల కారణంగా కొన్ని చోట్ల ఎక్కువగా, మరికొన్ని చోట్ల తక్కువగా పిడుగులు పడతాయి.



గాదిగూడ మండలం పిప్పిరి గ్రామంలో పిడుగుపడిన ప్రదేశం(ఫైల్)

రూ.6లక్షలు పరిహారం

గతంలో కేవలం ఆపద్బంధు పథకం కింద నామమాత్రంగానే పరిహారం చెల్లించేవారు. ప్రస్తుతం పిడుగుపాటుకు మరణించిన వారికి రూ.6లక్షలు పరిహారంగా అందజేస్తున్నారు. పిడుగుపాటుతో మరణించినట్లు స్థానిక రెవెన్యూ, వైద్య, పోలీసు అధికారులు ధ్రువీకరించాలి. అయితే పరిహారం పొందడంలో కొన్నిసార్లు జాప్యం జరుగుతోంది.

చెట్ల కింద ఉండొద్దు

వర్షం పడితే చాలామంది చెట్ల కింద తడవకుండా ఉండేందుకు వెళ్తుంటారు. అయితే చెట్లు, ఎత్తయిన కొండలు, నీటి నిల్వ ప్రదేశాలు మరింతగా పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది. చెట్ల కింద చెరువులు, కాలువల వద్ద ఉండకూడదు. ఒకే చోట అందరూ గుంపులుగా ఉండకూడదు.

ఒకే రోజు ఆరుగురు

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పిప్పిరిలో పంట చేనులోనే నలుగురు, బేల మండలం సాంగిరిలో ఇద్దరు మొత్తం గురువారం ఒకే రోజులో ఆరుగురు ప్రాణాలు విడిచారు. ఉట్నూరు మండలం కుమ్మరితండాలో పిడుగుపాటుకు ముగ్గురు గాయపడ్డారు.

> **స్మార్ట్‌ఫోన్లలోనూ..**
> వాతావరణ మార్పులు ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లలోనూ తెలుసుకోవచ్చు. ఎస్ఎంఎస్, వాట్సాప్‌ల్లోనూ అలర్ట్ పొందవచ్చు. ఐఎండీ (ఇండియన్ మెటీరియలాజిక్ డిపార్ట్‌మెంట్)తోపాటు పిడుగు పడే ప్రాంతాలను ముందుగానే తెలియజేసే 'దామిని'తోపాటు ఇతర యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా స్థానిక కేవీకే, వ్యవసాయ, ప్రణాళిక శాఖ అధికారుల వద్ద వాతావరణ పరిస్థితులు ముందస్తుగా తెలుసుకోవచ్చు. వర్షాలు అధికంగా ఉన్నప్పుడు ముందస్తుగా తెలుసుకుంటూ ప్రాణాలతోపాటు ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవచ్చు.

> **జాగ్రత్త మరవద్దు**
> ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు తప్పించుకోవచ్చు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ శబ్దాలు వినిపిస్తే వెంటనే అక్కడ నుంచి దూరంగా వెళ్లాలి. పంట చేన్లలో ఉన్నప్పుడు వీలైనంత తొందరగా ఇళ్లకు చేరుకోవాలి. సమీపంలో ఉన్న నివాస స్థలాలకు వెళ్లాలి. ఇళ్లలో విద్యుత్ పరికరాలు వినియోగించరాదు. సెల్‌ఫోన్లు, చార్జింగ్ చేయడం, ఐరన్, వాటర్ హీటర్లు, గీజర్లు వాడరాదు. ఇళ్లకు లైటనింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి.

తప్పించారా.. తప్పుకున్నారా!

- 'జిల్లా ఇన్‌చార్జి మంత్రి'పై సర్వత్రా చర్చ
- హాట్‌టాపిక్‌గా సీతక్క మార్పు
- గతంలోనే ఆమెపై 'మీనాక్షి'కి ఫిర్యాదు
- అప్పట్లోనే తప్పుకుంటానన్న మినిస్టర్

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన సీతక్కను ఆ బాధ్యతల నుంచి తప్పించారా.. లేక ఆమే తప్పుకున్నారా.. అనే చర్చ ప్రస్తుతం పార్టీలో సాగుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశాల సందర్భంగా కొంతమంది నియోజకవర్గ ఇన్‌చార్జిలు సీతక్క తమను పట్టించుకోవడం లేదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు అప్పట్లో ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించింది. అప్పుడే తాను జిల్లా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటానని ఆమె మీనాక్షి ముందే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

అటు నుంచి ఇటు.. ఇటునుంచి అటు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన సీతక్కను ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. అక్కడి నుంచి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఉమ్మడి ఆదిలాబాద్‌కు ఇన్‌చార్జిగా కేటాయించారు. ప్రస్తుతం పార్టీలో ఈ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారింది. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు ముందు జూపల్లి ఇక్కడి నేతలను సమన్వయం చేస్తూ పార్టీ విజయానికి ఏ విధంగా కృషి చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సీతక్కకు కలిసిరాని ఎన్నికలు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన సీతక్కకు ఆదిలాబాద్ పార్లమెంట్, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అసలు కలిసిరాలేదు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. పార్టీ పెద్దగా ప్రభావం చూపకపోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పనితీరుపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు పెరగడం కూడా పార్టీ ఓటమికి కారణమయ్యాయని చర్చ సాగింది. ఇదే విషయంలో మీనాక్షి నటరాజన్ పార్టీ ఓటమికి కారణాలపై ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో ప్రధానంగా విశ్లేషించారు. అంతేకాకుండా ఇటీవల హైదరాబాద్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను ఒక్కొక్కరి నుంచి విడివిడిగా అభిప్రాయ సేకరణ చేశారు. ఆ తర్వాతనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మార్పు ఖాయమనే ప్రచారం సాగింది.

కొత్త ఇన్‌చార్జి మంత్రికి సవాలు..

ఉమ్మడి జిల్లాకు కొత్త ఇన్‌చార్జి మంత్రిగా రానున్న జూపల్లికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే ఆయన ముందున్న ప్రధాన సవాలు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో నాలుగు చోట్ల బీజేపీ, రెండు చోట్ల బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, కేవలం ఖానాపూర్ నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ప్రాతినిధ్యం ఉంది. మిగతా నియోజకవర్గాల్లో అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన వారు నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జూపల్లి ఎలాంటి ఎత్తుగడలతో ముందుకెళ్తారనేది వేచి చూడాల్సిందే.



సీతక్క



జూపల్లి కృష్ణారావు

వీటిపై ప్రభావం పడేనా..

పార్టీ పరంగా ప్రస్తుతం పట్టణ, మండల, బ్లాక్ కమిటీలతోపాటు డీసీసీ అధ్యక్షుల నియామకం చేపట్టాల్సి ఉంది. కమిటీలకు సంబంధించి ఇప్పటికే ప్రతి మండలం, పట్టణంలో సమావేశాలు నిర్వహించి ఐదేసి పేర్లను అధిష్టానానికి నివేదించారు. అది ఖరారు కావాల్సి ఉంది. ఆ తర్వాత ఈనెల చివరిలో డీసీసీ అధ్యక్షుల నియామకం చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిశీలిస్తే.. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. ఇక మంచిర్యాలకు కొక్కిరాల సురేఖ, నిర్మల్‌కు శ్రీహరిరావు, కుమురంభీం ఆసిఫాబాద్‌కు విశ్వప్రసాద్ ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. కొత్త ఇన్‌చార్జి మంత్రి డీసీసీ అధ్యక్షుల నియామకంపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే ఆసక్తి పార్టీలో నెలకొంది.

ఇప్పటివరకు 46సార్లు..



పాతమంచిర్యాల: నాది ఏబీ నెగెటివ్ బ్లడ్ గ్రూప్. ఇప్పటివరకు 46సార్లు రక్తదానం చేశాను. కలెక్టర్లు, గవర్నర్ ద్వారా ప్రశంసాపత్రాలు అందుకున్నాను. రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాను. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో నిల్వలు ఉండేలా కృషి చేస్తున్నాను. రక్తదాతలకు ప్రమాద భీమా పాలసీ అందజేస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి

25 ఏళ్లుగా ఇస్తున్న



పాతమంచిర్యాల: నాది ఏ పాజిటివ్ బ్లడ్ గ్రూప్. ఇప్పటివరకు 80 సార్లు రక్తదానం చేశాను. పుట్టినరోజు, అయ్యప్ప దీక్ష తీసుకునే రోజు తప్పనిసరిగా రక్తనిధి కేంద్రానికి వచ్చి రక్తం ఇస్తాను. నా స్నేహితులతో కూడా రక్తదానం చేయిస్తున్నాను. రక్తదానం.. మహాదానం.

– పెద్దపల్లి లక్ష్మీకాంత్

రక్తదానం.. ప్రాణదానం

• ఆపదలో 'సామాజిక' నేస్తాల అండ • ప్రత్యేక గ్రూపుల ద్వారా బాధితులకు భరోసా • ప్రాణదాతలుగా నిలుస్తున్న యువత • నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

పాతమంచిర్యాల/ఆసిఫాబాద్‌అర్బన్/నిర్మల్‌ఖిల్లా: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం. అత్యవసర సమయాల్లో వైద్యులు ఒకరి నుంచి రక్తాన్ని సేకరించి మరొకరికి ఎక్కించి ప్రాణాపాయం నుంచి కాపాడుతారు. సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతీవారం లేదా ప్రతీ నెల క్రమంతప్పకుండా రక్తం ఎక్కించాల్సిందే. అలాంటి వారికి రక్తదాతలు నిజంగా ప్రాణదాతలే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు తమ రక్తాన్ని దానం చేసి ఇతరుల ప్రాణాలు నిలుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఉమ్మడి జిల్లాలో సేవలు ఇలా..

మంచిర్యాల జిల్లా కేంద్రంలో లయన్స్ ఇంటర్నేషనల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సంస్థ ప్రతినిధులు కొద్ది సంవత్సరాలుగా రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, ప్రభుత్వాస్పత్రుల్లోని గర్భిణులు, వివిధ ప్రమాదాల బాధితులకు అందిస్తున్నారు. అలాగే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే శిబిరాల్లో యువకులు రక్తదానం చేయడానికి ముందుకు వస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతీ శిబిరంలో తప్పనిసరిగా 20నుంచి 50 యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. రక్తదానం ఆవశ్యకతను మరో నలుగురికి తెలియజేయాలనే సంకల్పంతోనే పలువురు సామాజిక మాధ్యమాల ద్వారా బాధితులకు చేరువవుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రమోద్‌కుమార్, భైంసా పట్టణానికి చెందిన యోగేశ్ రక్త గ్రూపుల వారీగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి 'ప్రేరణ యువసేన' పేరిట బాధితులకు రక్తాన్ని సమకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు వందలాది మందికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారారు. ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలకేంద్రానికి చెందిన మునిగెల శ్రీధర్ శుద్ధోధన్, శ్రీనివాస్, నిర్మల్ జిల్లాకు చెందిన కొప్పుల నవీన్, సాగర్ తదితరులు 'జైహింద్' గ్రూపును 2018లో ఏర్పాటు చేసి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటివరకు 200 మందికి పైగా రక్తదానం చేసినట్లు వీరు తెలిపారు.

ఎవరు రక్తదానం చేయొచ్చంటే..

ఆరోగ్యవంతులుగా ఉన్న 18–60 ఏళ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని చెబుతున్నారు. అయితే.. దీర్ఘకాలిక వ్యాధులు, హెచ్‌ఐవీ, రక్తపోటు, హైపటైటిస్ ఉన్నవారు రక్తదానం చేయరాదని పేర్కొంటున్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేసిన తర్వాత తిరిగి మూడు నెలలకు మళ్లీ రక్తదానం చేయవచ్చని సూచిస్తున్నారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదేనని పేర్కొంటున్నారు. రక్తదానం చేసే సమయంలో ఇతర వ్యాధులు సోకుతాయనే మాటల్లో నిజం లేదని తెలిపారు. అవన్నీ అపోహలేనని చెబుతున్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, పైగా రక్తదానం చేస్తే శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేయడంతో పాటు రక్తం శుద్ధి అవుతుందని సూచిస్తున్నారు.



రక్తదాన దినోత్సవ నేపథ్యం

1901లో ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్ల్ లాండ్‌స్టీనర్ మొదటిసారిగా రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన జయంతికి గుర్తుగా ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఏటా జూన్ 14వ తేదీన నిర్వహిస్తున్నారు. రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ దేశాలు జూన్ 14వ తేదీన రక్తదాన దినోత్సవాన్ని 2004నుంచి నిర్వహిస్తున్నాయి.



ఎవరు ఫోన్ చేసినా వెళ్తా..



పాతమంచిర్యాల: నాకు రక్తదానంపై అవగాహన ఉంది. ఇప్పటివరకు 15 సార్లు రక్తదానం చేశాను. 10 సార్లు ప్లేట్‌లెట్‌లు దానం చేశాను. నాది ఏ నెగెటివ్ గ్రూప్ రక్తం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ఎవరు ఫోన్ చేసినా వెళ్లి రక్తం ఇస్తున్నాను.

– మహ్మద్ మజార్, జాఫర్‌నగర్, మంచిర్యాల

అత్యవసరాల్లో తప్పకుండా చేస్తా



పాతమంచిర్యాల: నాది ఓ పాజిటివ్ గ్రూప్ రక్తం. అత్యవసర సమయాల్లో ఏ ఆస్పత్రి నుంచి ఫోన్ వచ్చినా రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెళ్లి రక్తదానం చేస్తున్నాను. రక్తం అవసరమైనపుడు బ్లడ్ బ్యాంక్ వారు సమాచారమిచ్చినా వెంటనే వెళ్లి రక్తం ఇస్తున్నాను.

– నంది రాజేంద్రప్రసాద్, ఇటిక్యాల

పదేళ్లుగా సేవలో..



పాతమంచిర్యాల: పదేళ్లుగా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఇప్పటివరకు 2,600 మందికి రక్తదానం చేయించాను. అత్యవసర వేళల్లో దాతలను పిలిపించి రక్తం ఇప్పిస్తున్నాను.

– అబ్దుల్ రహీం, రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ, మంచిర్యాల

40 సార్లు చేశాను



ఆసిఫాబాద్‌అర్బన్: ఇప్పటివరకు నేను 40 సార్లు రక్తదానం చేశాను. 16 ఏళ్లుగా రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను. స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. రక్తాన్ని దానం చేయడం అదృష్టంగా భావిస్తాను.

– వైరాగడే ప్రతాప్, ఆసిఫాబాద్

రక్తదాతలను ప్రోత్సహిస్తా



ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌కు దాతలతో వెయ్యి యూనిట్ల రక్తం ఇప్పించాను. అత్యవసర సమయాల్లో ఎంతోమందిని ఆదుకున్నాను. నేను 10 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా రక్తం అవసరమైతే 8639434390 నంబర్‌లో సంప్రదించాలి.

– మాడిశెట్టి ప్రశాంత్, సామాజిక కార్యకర్త

100 సార్లు ఇవ్వడమే నా లక్ష్యం



ఆసిఫాబాద్‌అర్బన్: నేను ఇప్పటివరకు 34 సార్లు రక్తదానం చేశాను. 100 సార్లు రక్తం ఇవ్వాలన్నదే నా లక్ష్యం. రక్తదానంపై ప్రజలకు అవగాహన కూడా కల్పిస్తున్నాను. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు నిలపడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– ఎండీ మొయినొద్దీన్, ఆసిఫాబాద్

వెంటనే స్పందిస్తాం



భైంసాటౌన్: బ్లడ్ డోనర్ గ్రూప్ ద్వారా అవసరమైన వారికి రక్తదానం చేస్తున్నాం. రక్తం అవసరమని గ్రూపులో ఎవరు పోస్ట్ చేసినా.. వెంటనే స్పందిస్తాం. ఇప్పటివరకు వందలాదిమందికి గ్రూపులోని సభ్యులు రక్తదానం చేశారు. ఇలాగే సేవలను కొనసాగిస్తాం.

– సురేశ్, బ్లడ్ డోనర్ గ్రూప్ అడ్మిన్, భైంసా

సేవలోనే సంతృప్తి



భైంసాటౌన్: ఆపదలో ఉన్న వారికి సేవ చేయాలని భావించాం. ఇందుకు ఐక్యత సేవాసమితి గ్రూపును ఏర్పాటు చేశాం. రక్తదానం చేస్తున్నాం. ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రక్తం అవసరమైన వారికి వెంటనే స్పందించి రక్తదానం చేస్తున్నాం.

– యోగేశ్, ఐక్యత సేవాసమితి అడ్మిన్, భైంసా

క్లుప్తంగా

ఏసీబీ డీఎస్పీగా మధు



బాధ్యతలు స్వీకరిస్తున్న మధు

నస్పూర్: ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీగా మధు శుక్రవారం పట్టణంలోని ఏసీబీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో ఏసీపీగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ బదిలీపై కరీంనగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీగా వెళ్లారు.

రైతులను మోసగించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: కుభీర్ మండలంలోని జాంగామ్‌కు చెందిన రైతులను మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కుభీర్‌కు చెందిన సంగి శ్రీనివాస్ జల్సాగా తిరుగుతూ, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడేవాడు. కొద్దిరోజులకు కుభీర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు సీఈవోగా, భైంసాలోని మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్) సంస్థకు ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి మ్యాక్స్‌కు విక్రయించి, రైతులకు డబ్బులు చెల్లించేవాడు. ఇలా కొద్దిరోజులు రైతులను నమ్మించాడు. ఈ క్రమంలో గతంలో బెట్టింగ్‌తో చేసిన అప్పులు తీర్చేందుకు రైతులను మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు కుభీర్ మండలం జాంగామ్‌లో రైతుల నుంచి రూ.13,37,144 విలువైన 690క్వింటాళ్ల మొక్కజొన్నలు కొని డబ్బులు చెల్లించకుండా పారిపోయాడు. దీంతో రైతులు కుభీర్ పోలీసులను ఆశ్రయించగా, వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం కుభీర్‌లోని పార్డి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అతడి నుంచి రూ.9లక్షల నగదు, రిసిప్ట్ బుక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. లోకేశ్వరం మండలం మన్మద్, బామ్ని గ్రామాల్లో 32మంది రైతుల నుంచి 3,685 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసి మోసగించినట్లు తెలిపారు. కేసు విచారణ, నిందితుడిని పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి, నిర్మల్ ఐటీ టీంను ఎస్పీ జానకీ షర్మిల అభినందించినట్లు చెప్పారు.

బాసరలో భక్తుల రద్దీ



దర్శనానికి క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. శుక్రవారం శుభ ముహూర్తం కావడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సరస్వతీ, మహాలక్ష్మీ, మహాకాళీ అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారి దర్శనానికి మూడు గంటలు పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక అక్షరాభ్యాసం, సాధారణ అక్షరాభ్యాసం, అద్దెగదులు, చండీహోమం, శ్రీసత్యనారాయణ పూజ, వాహన పూజ టికెట్ల ద్వారా మొత్తం రూ.9,78,727 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

వేలం ద్వారా ఆదాయం

ఆలయ పరిధిలోని దుకాణసముదాయాలకు ఏడాది కాలపరిమితితో సీల్డ్, బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండ్లు అమ్ముకునే హక్కుల ద్వారా రూ.12.50లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా రూ.2.16లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు కోసం రూ.16.11లక్షలు, లక్ష్మి సదనం వెనుక వైపు గల షాప్‌నకు రూ.3,21,07 ఆదాయం సమకూరినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొత్తం టెండర్ల ద్వారా రూ.33,98,007 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్, జిల్లా దేవాదాయశాఖ పరిశీలకుడు రవికిషన్, ఎస్పీఐ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన మహ్మద్ ఫైసల్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు కాపాడారు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫైసల్ కుటుంబ సమస్యలతో సతమతమవుతూ గురువారం రాత్రి తన తండ్రికి 'నేను ఇక నుంచి మీకు దూరమవుతున్నాను, నాన్న సెలవు' అని వీడియో సందేశాన్ని పంపించి ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో తండ్రి ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే సెల్‌ఫోన్ ఆధారంగా అతడిని గుర్తించారు. తాంసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డాడి ప్రాజెక్టు వద్ద బాధితుడి సెల్ సిగ్నల్ ఉండగా వెంటనే తాంసి డయల్ 100, బ్లూకోల్ట్స్, ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది కలిసి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. సదరు యువకుడిని గుర్తించి తండ్రికి అప్పగించారు. యువకుడి కుటుంబ సభ్యులు ఎస్పీ, పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సివిల్ సర్వీసెల్‌లో ఉచిత శిక్షణ కోసం ఈనెల 16 నుంచి జూలై 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో సూచించారు. జూలై 25 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

వృద్ధురాలిని కాపాడిన బాసర కానిస్టేబుల్

బాసర: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని స్థానిక కానిస్టేబుల్ మోహన్‌సింగ్ కాపాడారు. వివరాలు.. నిజామాబాద్ జిల్లా కంఠం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇంట్లో గొడవపడి బాసర గోదావరినదిలో దూకేందుకు శుక్రవారం ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి ఆమెను నదిలో దూకకుండా అడ్డుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వృద్ధురాలిని కాపాడిన కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను పలువురు అభినందించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

లోకేశ్వరం: మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంలో మండలంలోని నగర్ గ్రామానికి చెందిన పోసులు అనే వ్యక్తిని గురువారం అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్, గడ్డం సాయిలు నడి రోడ్డుపై ఇటుక, బండ రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ముధోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. ఆయన వెంట లోకేశ్వరం ఎస్సై అశోక్ ఉన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

ముధోల్: మండల కేంద్రంలోని బ్రహ్మణ్‌గావ్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు ఇటీవల తప్పిపోగా శుక్రవారం వారిని పట్టుకున్న పోలీసులు తల్లికి అప్పగించారు. ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు నెలల క్రితం గోదావరి భర్త గడ్డం శివరాజ్ మృతి చెందగా గోదావరి తన ఇద్దరు పిల్లలు దీక్షిత్, రీక్షిత్‌తో బాసరలోని తల్లిగారింటికి వెళ్లింది. గత మే 5న శివరాజ్ తండ్రి పోతన్న పిల్లలను బాసర నుంచి తీసుకువస్తానని వెళ్లి వారిని తీసుకుని నిజామాబాద్‌లోని ఓ ఆశ్రమానికి వెళ్లిపోయాడు. అయితే కుటుంబ సభ్యులకు సమాచారం అందించకపోవడంతో వారు పిల్లలు, పోతన్న ఆచూకీ కోసం గాలించారు. వారి ఆచూకీ తెలియకపోవడంతో మే 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేయగా నిజామాబాద్‌లోని ఓ ఆశ్రమంలో ఉన్నట్లు తెలిసింది. వారిని ముధోల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి శుక్రవారం తల్లికి అప్పగించారు. దీంతో బాధిత కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనికేషన్ నైపుణ్యాలు తప్పనిసరి



లేఖ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: విద్యార్థులకు తమ ప్రసంగాల్లో పదాలు, వాక్యాల నిర్మాణంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతగానో అవసరమని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ సూచించారు. ఇంగ్లిష్ విభాగం, ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు, అధికారులకు వివిధ సందర్భాల్లో సరైన భాష, వ్యాకరణం, శైలి, ఫార్మాట్ లోపం లేకుండా లేఖలు రాయడానికి ఉపయోగపడే లేఖ నమూనాలను రూపొందించి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. నమూనా లేఖలు స్టూడెంట్ హబ్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాటి ఆధారంగా విద్యార్థులు, అధికారులకు వివిధ అవసరాల కోసం సరైన రూపంలో, నిష్పాక్షికంగా లేఖలు తయారు చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, ఇంగ్లిష్ విభాగాధిపతి శ్రీఅప్పింగర్ విజయ్‌కుమార్, ఇంగ్లిష్ విభాగ అధ్యాపకులు, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

యువకులపై దాడిచేసిన ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: యువకులపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన షేక్ అజీమ్, షేక్ అజీజ్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో అమెన్ అనే వ్యక్తి వారిపై ఉమ్మివేశాడు. దీంతో ఉమ్మివేసే సమయంలో జాగ్రత్తగా చూడాలని వారు అమెన్‌కు సూచించారు. దీంతో అమెన్ కోపంతో వారిని దుర్భాషలాడాడు. అక్కడినుంచి వారు వెళ్లిపోగా, షేక్ అజీజ్ తన బైక్‌పై కిరాణా షాపు ముందు ఉండగా, అమెన్ మళ్లీ వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఆయనతో పాటు వచ్చిన నాహిద్, అర్బాజ్, కొందరు మైనర్లు అజీజ్‌పై దాడికి దిగారు. దీంతో ఫిర్యాదుదారు పాత బస్టాండ్ వైపు వెళ్తుండగా, నాహిద్, మైనర్, జునేద్ అనే వ్యక్తులు ఆయనపై రాళ్లు, కర్రలతో దాడిచేసి పరారయ్యారు. బాధితుడి తలకు గాయమై రక్తస్రావం కాగా, రిమ్స్‌లో చికిత్స పొందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరించారు. మైనర్లను నిజామాబాద్ జ్యువెనల్ కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



రామేశ్వర్ (ఫైల్)

ఇంద్రవెల్లి: రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హర్కాపూర్ అంద్‌గూడ గ్రామానికి చెందిన మస్కే రామేశ్వర్ (25) ఈ నెల 11న ఇంద్రవెల్లికి చెందిన షేక్ సాజిద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్‌కు వెళ్లాడు. రాత్రి ఇంటికి వస్తున్న సమయంలో మండలంలోని శంకర్‌గూడ సమీపంలో ప్రధాన రహదారిపై ఇంద్రవెల్లి నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామేశ్వర్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు, కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండగా నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చిక్సిత పొందుతూ మృతి చెందాడు. తల్లి విమలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగు పడి ఎద్దు మృతి

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ప్రకాశ్ అనే రైతుకు చెందిన ఎద్దు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి మృతి చెందింది. వారంరోజుల ముందే విద్యుత్‌షాక్‌తో ఒక ఎద్దు మృతి చెందగా.. పిడుగు పడి ఇప్పుడు మరో ఎద్దు మృతి చెందిందని బాధిత రైతు వాపోయాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నాడు.

బైక్ చోరీ నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో బైక్ చోరీలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, ముఖరాం చౌరస్తా ప్రాంతాలకు చెందిన భరత్‌రేణ్వా, కుడుదుల శ్రీనుకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు ఇటీవల చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఐబీ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న స్థానిక సూర్యనగర్‌కు చెందిన గుండేటి రాకేశ్, బొల్లి ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కుడుదుల శ్రీనుకు చెందిన బైక్, భరత్ రేణ్వాకు చెందిన స్కూటీని దొంగిలించినట్లు వారు ఒప్పుకొన్నారని పేర్కొన్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.